జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 1 | మార్చి | 2026 | పేజీలు : 9



# కొత్త కౌన్సిలర్లు... ఆన్ డ్యూటీ..!

2 లో..

● ఇల్లందు, ప్రజాజ్యోతి

- వార్డులలో పర్యటిస్తున్న చైర్ పర్సన్
- ఉదయం నుంచి వార్డులో కలియతిరుగుతున్న వైస్ చైర్మన్
- వార్డుల సమస్యల పరిష్కా రానికి చొరవ
- కనీస సౌకర్యాలపై ఫోకస్
- శానిటేషన్, మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టి
- అభివృద్ధి పనులపై ఆరా

ఈనెల రెండవ వారంలో ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికలు జరిగినా వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లు అప్పడే ప్రజా సేవలో మునిగిపోయారు. గెలిచిన మహిళా కౌన్సిలర్లతో పాటు మహిళా చైర్ పర్సన్ సైతం ఆయా వార్డుల సమస్యల పరిష్కారానికి సంసిద్ధులయ్యారు. వార్డు ప్రజలకు కనీస సౌకర్యాలైన మంచినీరు, శానిటేషన్, డ్రైనేజీ, వీధిలైట్లను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు మార్నింగ్ వాక్ లో కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ నిమగ్నం కాగా చైర్ పర్సన్ వార్డులలో పర్యటించి అక్కడి సమస్యలను నేరుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు వార్డులలో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజల నుండి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నాలు షురూ చేశారు.



# గర్భం దాల్చిన మైనర్ విద్యార్థిని..

- గర్భ ఘటన వివరాలు గోప్యంగా ఉంచినప్పటికీ
- ప్రజాజ్యోతి ప్రచురించింది నిజమే
- ఇంటర్ ఎగ్జామ్ రాసేందుకు వచ్చి బాత్రూంలో ప్రసవించిన విద్యార్థిని
- స్థిరంగా ఉన్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి
- పాల్వంచలో కలకలం రేపిన విద్యార్థిని గర్భ ఘటనపై విచారిస్తున్న పోలీసులు

పాల్వంచ, ఫిబ్రవరి 28 ,ప్రజాజ్యోతి

ఈనెల 27న ప్రజా జ్యోతి లో ప్రచురించిన గర్భం దాల్చిన మైనర్ విద్యార్థిని వార్త నిజ మైంది, మైనర్ విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన పై పోలీసులు , కళాశాల యాజమాన్యం ఆసుపత్రి వర్గాలు గోప్యంగా ఉంచినప్పటికీ శనివారం గర్భం దాల్చిన విద్యార్థిని ఒక్కసా రిగా మృత శిశువుకు జన్మనిచ్చిన సంఘటన పాల్వంచలో కలకలం రేపింది, ఇందుకు సంబంధించిన వివరాలు -----

2 లో...

## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో...

# ఇటుక మాఫియా దందా!

- పినపాక మండలంలో నాసిరకం ఇటుకలతో ప్రజలపై బహిరంగ దోపిడీ
- ఇటుక ఖరీదు 25 నుండి 26 రూ, నాణ్యత మాత్రం సున్నా!
- అనుమతుల్లేని యార్డులు
- అధికారుల మౌనం ఎందుకు?



2 లో...

## శ్రీరామనవమి ఉత్సవాలకు ముందస్తుగా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

పాల్వంచ, ఫిబ్రవరి 28,ప్రజా జ్యోతి మార్చి 27, 28 తేదీలలో జరగనున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం, మహా పట్టాభిషేక ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు ముందస్తుగా అప్రమత్తమై, పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్

మిగతా 2 లో...



## పేద–మధ్యతరగతి కుటుంబాల కష్టాలకు చెక్

- పేదల పెళ్లిళ్లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
- సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ -ఎమ్మెల్యే జారె



7 లో...

## పాల్వంచ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ మేళా

- సైన్స్ మేళలో పాల్గొన్న ఐటీడీఏ పీవో రాహుల్
- విద్యార్థులు సైన్స్ అంశాలపై ఆసక్తి చూపాలి



2 లో...

## గర్భం దాల్చిన మైనర్ విద్యార్థిని...

(మొదటి పేజీ తరువాయి...)

పాల్వంచలోని ఒక ప్రైవేట్ కాలేజీకి చెందిన ఇంటర్ ఒకేషనల్ స్టూడెంట్ పట్టణంలోని కేజీబీవీ లో శనివారం ఎగ్జామ్ కు అటెండ్ అయింది, ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చిన పదహారేళ్ల విద్యార్థిని పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికి కడుపునొప్పి ఉందని చెప్పి వాష్ రూమ్ కి వెళ్ళింది, చాలాసేపటికి బయటకు రాకపోవడంతో మహిళ ఇన్విజిలేటర్ కు లెటర్ అనుమానం వచ్చింది, సిబ్బంది బాత్రూం తలుపు తెరిచి చూడగా అక్కడే ఆమె మృత శిశువుకు జన్మనిచ్చినట్టు గుర్తించారు, సమాచారం ప్రకారం శిశువు మృతదేహాన్ని ఎవరికి తెలియకుండా బేషన్లో దాచినట్లు తెలిసింది ,ఘటన తెలిసిన వెంటనే పరీక్షా కేంద్రంలో ఒక్కసారిగా ఆందోళన వాతావరణం నెలకొంది ,సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు , అసలు విద్యార్థిని గర్భం దాల్చటానికి కారకులు ఎవరు , విద్యార్థిని చదువుకుంటున్న కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమా ? కళాశాలలో ఏమి జరుగుతుంది , అనే విషయంపై పోలీసులు విద్యార్థిని గర్భ ఘటన పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## శ్రీరామనవమి ఉత్సవాలకు ముందస్తుగా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. నేడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భద్రాచలంలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించనున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపై భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, కళ్యాణ వేదిక వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కుళాయిలు, వాటర్ ప్యాకెట్ల సేకరణ వంటి పనులను ముందస్తుగానే పూర్తి చేయాలని, ఆలయ ఈవో దామోదర్ రావు పర్యవేక్షణలో విద్యుదీకరణ, ఆలయ సుందరీ కరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం వైద్య ఆరోగ్య శాఖ క్యూలైన్ల వద్ద వైద్య శిబిరాలను, అవసరమైన మందులు , సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని, ఏరియా ఆసుపత్రిలో అత్యవసర విభాగాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ వారు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలతో సిద్ధంగా ఉండాలని, పోలీస్ ట్రాఫిక్ విభాగాలు సమన్వయం చేసుకొని వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెక్టార్లను ఇప్పుడే ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల వసతి కోసం ఆన్‌లైన్ బుకింగ్, టికెట్ విక్రయాల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని, ఉత్సవ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా భక్తులకు భక్తి పరిపూర్ణమైన అనుభూతిని అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## పాల్వంచ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ మేళా



**పాల్వంచ, ఫిబ్రవరి 28,ప్రజా జ్యోతి** పాల్వంచలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళా కార్యక్రమాన్ని పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓకే అతిథిగా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రాహుల్, అకడమిక్ సెల్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో సైన్స్ మేళా వంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. సైన్స్ అంశాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, ప్రాయోగిక జ్ఞానం అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ మోడల్స్‌ను అధికారులు పరిశీలించి ప్రశంసించారు. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు.




# కొత్త కౌన్సిలర్లు... ఆన్ డ్యూటీ..!

- వార్డులలో పర్యటిస్తున్న చైర్ పర్సన్
- ఉదయం నుంచి వార్డులో కలియతిరుగుతున్న వైస్ చైర్మన్
- వార్డుల సమస్యల పరిష్కారానికి చొరవ
- కనీస సౌకర్యాలపై ఫోకస్
- శానిటేషన్, మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టి
- అభివృద్ధి పనులపై ఆరా

**ఈనెల రెండవ వారంలో ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికలు జరిగినా వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లు అప్పుడే ప్రజా సేవలో మునిగిపోయారు. గెలిచిన మహిళా కౌన్సిలర్లతో పాటు మహిళా చైర్ పర్సన్ సైతం ఆయా వార్డుల సమస్యల పరిష్కారానికి సంసిద్ధులయ్యారు. వార్డు ప్రజలకు కనీస సౌకర్యాలైన మంచినీరు, శానిటేషన్, డ్రైనేజీ, వీధిలైట్లను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు మార్నింగ్ వాక్ లో కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ నిమగ్నం కాగా చైర్ పర్సన్ వార్డులలో పర్యటించి అక్కడి సమస్యలను నేరుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు వార్డులలో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజల నుండి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నాలు షురూ చేశారు.**

**ఇల్లందు, ప్రజాజ్యోతి**

అయితే ఆయా వార్డు కౌన్సిలర్లుగా గెలిచిన మరుసటి రోజు నుండే ప్రజల మధ్యకు వెళ్లి మేమున్నామంటూ పలకరించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇల్లందు మున్సిపాలిటీలో పాలకవర్గం లేక ఏడాది గడిచిపోయింది. ఈనెల రెండవ వారంలో ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించి నూతన పాలక వర్గాలకు పదవి బాధ్యతలు అప్పగించింది. గత ఏడాది కాలంగా వార్డులలో మెదక్ ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం లేకపోవడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడవలసి వచ్చింది. మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారుల పాలన ఉండడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తవడంతో 24 వార్డులలో కౌన్సిలర్లు అందుబాటులోకి వచ్చారు. హోరాహోరీ పోరులో గెలిచిన వార్డు కౌన్సిలర్లు వెంటనే ప్రజాసేవకు బయలుదేరడం గమనార్హం. మున్సిపల్ కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ప్రజల మధ్యకు వెళ్లడం షురూ చేశారు. పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు అందరూ ప్రజల్లోకి వెళ్ళడంతో వార్డు ప్రజల్లో కొంత ఉత్సాహం కనిపిస్తుంది.

### ››› ప్రజా సేవకు అడుగులు

ఈసారి జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో యువత ఎక్కువగా వార్డు కౌన్సిలర్లుగా విజయం సాధించారు. మహిళలు 15 వార్డులలో విజయం సాధించారు. పురుషులు 9 వార్డులలో గెలిచారు. వీరంతా ప్రజాసేవ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. మొదటి సారిగా 19 మంది కౌన్సిలర్లు గెలిచిన వారు ఉన్నారు. 24 మంది వార్డు కౌన్సిలర్లు ఉత్సాహంగా వారి వారి వార్డులలో పర్యటిస్తున్నారు. దాదాపు ఏడాది పాటు వార్డులలో ప్రజా సమస్యల పరిష్కారం లేకపోవడంతో నూతన వార్డు కౌన్సిలర్లకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయనే చెప్పొచ్చు. వార్డు సమస్యలను తెలుసుకునేందుకు.. వాటిని పరిష్కరించేందుకు కౌన్సిలర్లు ప్రతిరోజు ఉదయం వార్డులలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నారు. మార్నింగ్ ద్వారా వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంచి అవకాశంగా వారు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్లుగా గెలుపొందిన వారంతా ఉరకలేస్తున్న ఉత్సాహంతో ప్రజాసేవకు అడుగులు వేస్తున్నారు.

### ››› చైర్ పర్సన్ వార్డుల పర్యటన

ఫిబ్రవరి 17న ఇళ్లను మున్సిపల్ చైర్ పర్సన్ గా దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ 11 రోజులలో సుమారుగా మూడు వార్డులకు పైగా పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమవుతూ నేరుగా వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి భరోసా ఇస్తున్నారు. అంతేకాకుండా మంచినీరు, వీధిలైట్లు, శానిటేషన్, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించడం జరుగుతుంది. ప్రతి వార్డులో పర్యటిస్తానని ఆయా వార్డుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య తనపై నమ్మకంతో మున్సిపల్ చైర్ పర్సన్ పదవి అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేస్తున్నారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారుల సహకారంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపాలిటీకి మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధిలో దేశ, రాష్ట్రస్థాయిలో ఇల్లందు మున్సిపాలిటీని అగ్రభాగాన నిలుపుతానని పేర్కొంటున్నారు.

### ››› 24 వార్డులలో 19 మంది కొత్త వారే

ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికల్లో 24 వార్డులకు గాను 19 మంది వార్డ్ కౌన్సిలర్లు కొత్తగా గెలిచిన వారే. ఐదుగురు మాత్రం రెండుసార్లు గెలిచారు. షేక్ సైదుమియా (1వ వార్డు), దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ (2వ వార్డు), అజ్మీరా వంశీ (3వ వార్డు), మహమ్మద్ కుష్బూ మునావర్ (4వ వార్డు), చిల్లా విజయ భారతి (5వ వార్డు), రాధ కమల్ కోరి (6వ వార్డు), గోపగాని రాజు (7వ వార్డు), రేఖ స్వరూప రవిశంకర్ (8వ వార్డు), గందె పద్మ సదానందం (9వ వార్డు), మెరుగు కార్తీక్ (10వ వార్డు), రంప రమ్య జాన్సన్ (12వ వార్డు), దండు సారయ్య (13వ వార్డు), నేరేడు ఉపేంద్ర (14వ వార్డు), సోనీ బాయి కోరి (15వ వార్డు), ఉల్లింగ విజయలక్ష్మి సతీష్ (16వ వార్డు), పెండేల రాజు (17వ వార్డు), పింగళి అనూహ్య (19వ వార్డు), యండి జాఫర్ (20వ వార్డు), కోర్లపాటి శివకిరణ్ (22వ వార్డు) కౌన్సిలర్లుగా మొదటిసారి విజయం సాధించారు. మొగిలి లక్ష్మి (11వ వార్డు), పాబోలు స్వాతి మణికిరణ్ (18వ వార్డు), నీలాపు రమేష్ (21వ వార్డు), కొండపల్లి సరిత (23వ వార్డు), చేనిగరపు శృతి రమేష్ (24వ వార్డు) కౌన్సిలర్లుగా రెండోసారి గెలిచారు. ఇల్లందు నూతన పాలకవర్గం నిత్యం ప్రజాసేవలో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని, మున్సిపాలిటీని అభివృద్ధి వరకు కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా సింగరేణి కార్పొరేట్ 19 వ వార్షిక క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవం






**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరీ 28 – ప్రజాజ్యోతి:** సింగరేణి కార్పోరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరం లో నిర్వహించినటువంటి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 19 వ క్రీడా వార్షికోత్సవం ను ఘనంగా కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమములో 2025–26 సంవత్సరములో గేమ్స్, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్, డబల్యూపిఎస్ అండ్ జిఏ కార్పొరేట్ ప్రెసిడెంట్ జి.వి.కిరణ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి, క్రీడాకారుల కోసం సుశిక్షితులైన కోచ్ లతో కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తూ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని, ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని క్రీడలు అనేవి శారీరక దృడత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ క్రీడలలో సీనియర్ క్రీడాకారులతో పాటు యువ ఉద్యోగులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. తదుపరి వివిధ క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు అభినందనలు తెలిపి, బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) కేసా నారాయణ రావు, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవ రావు, గుర్తింపు సంఘం( ఏఐటియుసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం( ఐఎన్టియుసి ) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ కేశవ రావు , డివై.పిఎం& కార్పొరేట్ ఏరియా హనరరీ సెక్రటరీ కే.సునీల్ కుమార్,సీనియర్ పిఓ ఏం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసి.పోస్నెట్, కార్పొరేట్ ఏరియా స్పోర్ట్స్ కొ–ఆర్డినేటర్ పి.నితిన్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అవమానకర వ్యాఖ్యలు

- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అవమానకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భద్రాచలం కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.తొలివెలుగు ఎలక్ట్రానిక్ మీడియా యజమాని రఘు తన ఛానల్‌లో ప్రసారం చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అనుచితంగా సంబోధిస్తూ, ప్రభుత్వ సిబ్బంది ఇళ్ల ఖాళీ చేయింపు అంశంపై అసభ్య పదజాలంతో విమర్శించారని ఆరోపించారు. ప్రజా ప్రతినిధిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు.ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని, బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.ఈ ఫిర్యాదు కార్యక్రమంలో భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఏ. రసూల్, యశోద రాంబాబు, కొంశెట్టి కృష్ణమూర్తి, అరికెల్ల తిరుపతిరావు, కొండవీటి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు





**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరీ 28 – ప్రజాజ్యోతి:** ఈనెల 23 నుండి 38 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజులపాటు జరిగిన 39వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ & ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి శ్రీ యం. డి జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. యస్&పి.సి. ట్రైనింగ్ సెంటర్, కొత్తగూడెం లో జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ...ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్&పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పని తీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరిగినదని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, మరియు భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగినదని, మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మరియు మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించగలమని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణ గావించారు. కోర్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కె.కుమార్, యం.శివనారాయణ కు బహుమతి ప్రదానం గావించారు. ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి వందనసమర్పణ చేసారు.

## మార్గదర్శినిలో ఘనంగా సైన్స్ ఫెర్






**ఇల్లందు, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి:** ఇల్లందు పట్టణంలోని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫెర్ ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, ఆర్వపల్లి రాధాకృష్ణ సైన్స్ ఫెర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి జీవన విధానం సైన్స్ తోనే ముడిపడి ఉందన్నారు. ఈ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ‘‘స్వదేశీ టెక్నాలజీస్ ఫర్ వికసిత్ భారత్’’ భారత దేశ సమగ్ర అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యతను గుర్తించడంతో పాటు, దేశీయంగా వివిధ వర్గాల పౌరులకు తమ దైనందిన జీవితంలో ఉపయోగపడేలా సైన్స్ ను, సైంటిఫిక్ రీసెర్చ్ ను ప్రోత్సహించడానికి ఈ థీమ్ కు రూపకల్పన చేశారని తెలిపారు. మానవ సంక్షేమంలో శాస్త్రవేత్తల కృషి, విజయాలను గుర్తించడం కూడా ఈ సైన్స్ దినోత్సవం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందిన విధానాన్ని అర్థం చేసుకోవడం, అలాగే ఈ రంగంలో మరింత కృషి చేయాల్సిన అంశాలను అన్వేషించి ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న వైజ్ఞానిక నైపుణ్యతను వెలికితీసి ప్రయోగాల ద్వారా ప్రదర్శించడం జరిగిందన్నారు. విద్యార్థుల ప్రయోగాలు ఎంతో ఆలోచింప చేశాయని తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఒబల్లోజు వెంకన్న, గోపి, యాస్మిన్, మానస, రోజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



**ఇల్లందు, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి:** సుదిమళ్ల ప్రధాన రోడ్డుపై జరిగిన ప్రమాదం మాదిరిగా భవిష్యత్తులో మరల అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం ఇల్లందుకు వచ్చిన ఎస్పి సుదిమళ్ల ప్రధాన రోడ్డుపై జరిగిన ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి, ప్రమాదానికి గల కారణాలను ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు ను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హైవే అధికారుల సహకారంతో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పి కోరారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వాహనదారులు వేగంగా వాహనాలను నడపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులందరూ బాధపడాల్సి వస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు, సీఐ తాటిపాముల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రేగా సమక్షంలో బీఆర్ఎస్ లో చేరికలు

**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని మేజర్ పంచాయతీ సారపాకలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ లోకి చేరికలు ఉన్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సారపాక సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసిన భూక్యా ప్రవీణ్ తో పాటు ఆయన అనుచరులు కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలకు, ఇబ్బందులకు గురై కాంగ్రెస్ పార్టీపై విసుగు చెంది బీఆర్ఎస్ లోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామనే ఉద్దేశ్యంతో పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు కొనకంచి తెలిపారు. ఉదయం 9 గంటలకు భాస్కర్ నగర్ కాలనీలో ఈ చేరికలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల, పట్టణ బాధ్యులు, అనుబంధ సంఘాలు ప్రతిఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ




**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి):** 2026–27 విద్యాసంవత్సరానికి గాను సైనిక్ స్కూల్ ఫలితాల్లో సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ బీఎస్ఆర్ శనివారం తెలిపారు. సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ కు బి.సంకల్ప తేజ్, ఎం.జశ్వంత్, జె.ఇందూజ, జి.రితికినిశాంత్, ఎం.విఘ్నేష్, ఎస్.వేదాన్ రెడ్డిలు ఎంపికై జాతీయస్థాయిలో బ్రిలియంట్ కు మంచి గుర్తింపు తెచ్చారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు ఉన్నత చదువులు చదివి మంచి ర్యాంకులు సాధించి ఊరుకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల చైర్మన్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. **ఘనంగా సైన్స్ దినోత్సవం...** సారపాక బ్రిలియంట్ పాఠశాలలో శనివారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన పలు ప్రయోగాలను విద్యాసంస్థల చైర్మన్ బీఎస్ఆర్ పరిశీలన చేసి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకుని వారి మేధాశక్తిని అభినందించారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని నేడు చిన్న ప్రయోగాలే రేపు అద్భుతాలని సృష్టించే స్థాయికి దిశానిర్దేశమవుతాయన్నారు. సైన్స్ ప్రయోగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# శ్రీ సరస్వతీ విద్యా నికేతన్ లో జాతీయ విజ్ఞాన దినోత్సవం



**చర్ల, ఫిబ్రవరి 28: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తేగడలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవ సందర్భంగా శ్రీ సరస్వతి విద్యా నికేతన్ లో సైన్స్ డే ని నిర్వహించారు . 1928లో సర్ సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్ ను కనుగొన్న సందర్భంగా ఈ సైన్స్ డే ని జరుపుకుంటారని, ఈ సంవత్సరపు థీమ్ "విజ్ఞాన శాస్త్రంలో మహిళలు వికసిత్ భారత్ ను నడిపించడం," అని, విజ్ఞాన శాస్త్రం కేవలం పాఠ్యపుస్తకాలు లేదా సూత్రాల గురించి కాదు అని అది ఉత్సుకత, ఆవిష్కరణ, సమస్య పరిష్కారం గురించి అని మనం రోజువారీ ఉపయోగించే సాంకేతికత నుండి వైద్య పురోగతుల వరకు, విజ్ఞాన శాస్త్రం మన జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది అని, విద్యార్థులారా, శాస్త్రీయ మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం, ఉత్సుకతను, ప్రయోగాలను స్వీకరించడం చాలా అవసరం అని, భారతదేశ శాస్త్రీయ పురోగతికి మార్గం సుగమం చేసిన డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం, హోమీ జె. భాభా, కల్పనా చావ్లా వంటి వారినీ గుర్తు చేసుకుంటూ ప్రేరణ పొందాలి అని, విజ్ఞాన శాస్త్రం కేవలం ఒక విషయం కాదని ఒక ఆలోచనా విధానం అని విద్యార్థినీ విద్యార్థులకు చాలా చక్కగా సంస్థ డైరెక్టర్ శ్రీమతి లిఖిత వివరించారు. విజ్ఞాన దినోత్సవం లో భాగంగా విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల స్వయంగా శాస్త్రీయ నమూనాలను తయారుచేసి వాటిని వివరిస్తూ ప్రదర్శించి ఉపాధ్యాయులను తల్లిదండ్రులను తోటి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా విద్యార్థి టోనీ నీటి ఆదా నమూనా, జోయెల్ ప్రిన్స్ ఫొటోసింథసిస్ నమూనా,మోక్షిక మన పర్యావరణం నమూనా జయనేష్ నీటి కాలుష్య నమూనాలను తయారు చేసి చాలా చక్కగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులందరూ పాఠశాల ఆవరణలో ముక్తకంఠంతో సైన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్, సైన్స్ ఫర్ బెటర్ లైఫ్ అని నినదించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజ, చంద్రకళ అరుణ రాజేశ్వరి శ్రావణి విద్యార్థులు పాల్గొన్నారు .

# గిరిజన చిన్నారుల విద్యను బలోపేతంకై ఎన్నో సంస్కరణలు: ఐటిడిఎ పిఓ





**ఇల్లందు, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి:** గిరిజన చిన్నారుల విద్యను బలోపేతం చేయడానికి ఎన్నో సంస్కరణలు చేపట్టడం జరిగిందని ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోని ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ సక్రమంగా జరగాలని, అలాగే పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఇల్లందు మండలంలోని పాత ఇల్లందులోని ఏజిహెచ్ఎస్ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు పిల్లల చేత బోర్డుపై అక్షరమాల, అధికారుల యొక్క పేర్లు ఎలా రాయాలో పిల్లల చేత రాయించారు. పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ ప్రతి అంశం రాయడం చదవడంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతి రోజు ఉద్దీపకంలోని ప్రతి పదాలు పిల్లల చేత చదవడం రాయడం చేయాలన్నారు. అనంతరం పదవ తరగతి పిల్లలతో మాట్లాడుతూ మీ భవిష్యత్తును పై చదువులకు వెళ్లడానికి పదవ తరగతి పరీక్షలు బాగా రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు అయిపోయే వరకు విద్యార్థినీ, విద్యార్థులను ఎవరిని ఇండ్లకు పంపకూడదని, డ్రాప్ అవుట్ పిల్లలు ఎవరైనా ఉంటే వెంటనే వారిని పాఠశాలలకు తీసుకొని రావాలని అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఎటువంటి మనసులో భయాలు పెట్టుకోకుండా బాగా చదువుకొని పరీక్షలు బాగా రాసి అత్యుత్తమ మార్కులతో పాస్ కావాలని, సంబంధిత ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా స్టడీ అవర్స్ నిర్వహించి వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం జిపిఎస్ పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న బాలిక పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు ఆశీర్వచనాలు ఇచ్చి చాక్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు భద్రాచలం డివిజన్‌లో మంత్రి పొంగులేటి పర్యటన

- చర్లలో ఆసుపత్రి శంకు స్థాపన
- భద్రాచలంలో శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి:** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు భద్రాచలం డివిజన్‌లో పర్యటించనున్నారు. ముందుగా ములుగు జిల్లా పర్యటనను ముగించుకుని ఉదయం సుమారు 11.45 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చేరుకోనున్నారు.చర్లలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణంతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.అనంతరం చర్లలోని కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో భద్రాచలం డివిజన్‌కు చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం.మధ్యాహ్నం 1.45 గంటలకు భద్రాచలం చేరుకుని ఉప కలెక్టర్ కార్యాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. దేవస్థానం అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించనున్నారు.అనంతరం సాయంత్రం కూసుమంచి మండల పర్యటనకు బయలుదేరి అక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిసింది.

# మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన రెవిన్యూ సిబ్బంది



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో శనివారం తెల్లవారుజామున ఇసుక తరలింపుకు సిద్దంగా ఉన్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దారు కార్యాలయంకు తరలించినట్లు తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు తెలిపారు. కొంతమంది ట్రాక్టర్ యజమానులు అక్రమంగా గోదావరి నుండి ఇసుకను తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారంతో ఇటీవల తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని, ఈ క్రమంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం పరుచుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. స్వాధీనం పరుచుకున్న ఇసుక మొత్తాన్ని త్వరలోనే బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేసిన తాసిల్దార్ కార్యాలయానికి గాని పోలీస్ శాఖ వారికి గాని సమాచారం అందించాలని సూచించారు.

# పునర్వసు నక్షత్రం సందర్భంగా భద్రగిరి ప్రదక్షిణ

- రామయ్యకు స్వర్ణ తులసార్చన
- రామయ్యకు రూ.1.59 లక్షల విలువ చేసే కంప్యూటర్లను అందజేత





**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారికి శనివారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తరామదాసు ట్రస్టు కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో భద్రగిరి ప్రదక్షణ నిర్వహించారు. తొలుత రామయ్యకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ ఉత్తరద్వారం వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహం వద్దకు చేరుకొని అక్కడ రామదాసు విగ్రహంకు పూజలు నిర్వహించారు. అనంతరం గిరిప్రదిక్షణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

**భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన...** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదరాణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక బృందం నిర్వహించారు.

**దేవస్థానంకు రూ. 1.59లక్షల విలువ చేసే మూడు కంప్యూటర్లు...** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంకు హైదరాబాద్‌కు చెందిన డా.కవిత రూ.1,59,300 విలువ చేసే మూడు కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. వీటిని దేవస్థానం ఈవో కార్యాలయంలో దేవస్థానం ఈవో కె.దామోదరరావు, ఏఈవో శ్రావణ్‌కుమార్‌లకు అందజేశారు.

# పాత మార్కెట్ సెంటర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

- ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు: సబ్‌ఇన్స్పెక్టర్ తిరుపతిరావు హెచ్చరిక



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** భద్రాచలం పాత మార్కెట్ సెంటర్‌లో రోడ్డు భద్రత నియమావళిపై ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సబ్‌ఇన్స్పెక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ, వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం ప్రమాదకరమని, అలాంటి చర్యల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులను ప్రత్యేకంగా హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు బయటపడితే వాహనదారులతో పాటు తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇద్దిచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణనష్టం తగ్గుతుందని వివరించారు. అలాగే కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు దాటేటప్పుడు పాదచారులు జీబ్రా క్రాసింగ్ వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు మరియు యువత ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వాహనదారులకు పాంప్లెట్లు పంపిణీ చేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో కూడా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహణ

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్



**భద్రాచలం, ఫిబ్రవరి 28 ,ప్రజాజ్యోతి :** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ సి.వి రామన్ కాంతి పైన చేసిన పరిశోధనకు గాను 1930 సంవత్సరంలో నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. విద్యార్థులందరూ సి.వి రామన్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు రంగోలి , వకృత్వ పోటీ, వ్యాస రచన పోటీ మరియు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగ వివిధ అధిపతులు ,కళాశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం










**చర్ల, ఫిబ్రవరి 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్మరాజు ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు సైన్స్ విశిష్టతను, జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రాముఖ్యతను, రామన్ ఫలితాన్ని విద్యార్థులకు వివరించారు. విజ్ఞాన శాస్త్రవేత్తలు సి.వి.రామన్, ఏపిజే అబ్దుల్ కలాం, సర్ ఐసాక్ న్యూటన్,లూయి పాశ్చర్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జగదీష్ చంద్రబోస్, శ్రీనివాస రామానుజన్,మేడం క్యూరీ తదితర వేషధారణలో ఉన్న శాస్త్రవేత్తల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్స్ ఒక్కొక్కటిగా వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.విద్యార్థులు వారిలో ప్రతిభను కనబరిచి ప్రాజెక్టులు చేయడంతో విద్యార్థులను, వారికి సహకరిస్తూ, ప్రోత్సాహం అందిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ డాక్టర్ డి.ఎన్ కుమార్, డాక్టర్ ప్రతిభ, ఈడి టీవీపీసీ శాస్త్రి, ప్రిన్సిపాల్ వర్మరాజు, తల్లిదండ్రులు అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎల్ నరసింహారావు, సైన్స్ ఉపాధ్యాయులు షేక్ ఉస్మాన్, అద్దంకి బోస్ బాబు, బిట్రగుంట క్రాంతి కుమార్, ఎం సునీత, ఆవుల జ్యోతి, సంగీత ,సౌజన్య,సంధ్య,చైతన్య తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బండారు ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి ):** సీపీఎం మాజీ మండల కార్యదర్శి, సీనియర్ నాయకులు అమరజీవి బండారు వెంకటేశ్వర్లు ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నకిరిపేట గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు బండారు వెంకటేశ్వర్లు ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయన సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లుతో కలిసి స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. బండారు తాను చేసిన ప్రజా ఉద్యమాలు, ప్రజాపోరాటాలు సీపీఎంకు అంకితభావంతో పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పాండవుల రామనాథం, గుంటక కృష్ణ, దామోదర్‌రెడ్డి, శ్యామల అజయ్‌కుమార్, బుర్రా వెంకన్న, బోళ్ల శ్రీశైలం, కందుకూరు నాగేశ్వరరావు, బండారు రాకేష్, పుల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మినారాయణ, ఎంఎల్ పార్టీ నాయకులు జక్కుల రాంబాబు, పాండవుల ఉపేందర్, ప్రభాకర్లు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ వేడుక



**చర్ల, ఫిబ్రవరి 28:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల పరిధిలో లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనం గా నిర్వహించారు .పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,మండల విద్యాధికారి పి .వి .రమణ సర్ సి .వి .రామన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి సైన్స్ అభివృద్ధికి రామన్ చేసిన కృషి ని వివరించారు .ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు తోట మల్ల సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యాక్రమం లో ఉపాధ్యాయులు తుర్రం జ్యోతి ,యాదగిరి ,నరేష్ ,అనిల్ ,రాజు లు పాల్గొన్నారు .

## ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో శనివారం టైలర్స్ డే వేడుకలను చర్ల రోడ్డులోని ఫేమస్ టైలర్స్ దుకాణం ఎదుట టైలర్స్ అంతా కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మల్లెల నరేష్ మాట్లాడుతూ ఎంతో కాలం నుంచి వస్త్రాలు పుట్టి జీవనం గడుపుతున్న టైలర్స్ నేడు రెడీమేడ్ వస్త్రాల వల్ల ప్రజలంతా రెడీమేడ్ వస్త్రాలకు మగ్గు చూపుతున్నారని టైలర్స్ ఆదరణ తగ్గిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వము స్పందించి టైలర్స్ కు పింఛను ఇన్సూరెన్స్ పిఎఫ్ అంటే పథకాలు కల్పించి టైలర్స్‌ను ఆదుకోవాలని కోరారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెల నరేష్, కార్యదర్శి తోకల రమేష్, ఉపాధ్యక్షులుసత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## నిరుపేద ఒంటరి మహిళలకు 'మేవా' ఆర్థికసాయం



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి ):** ముస్లీం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) ఆధ్వర్యంలో మండల పరిధిలోని సారపాక గ్రామానికి చెందిన ఇద్దరు ఒంటరి మహిళలకు రంజాన్ పురస్కరించుకుని మేవా బాధ్యులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.20వేలు శనివారం ఆర్థిక సాయం అందించారు. బసప్ప క్యాంప్ కు చెందిన జాహేరాబేగం పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు రూ.10వేలు, సారపాకలో కూలీ పనులు చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అమీనాకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ఇప్పటికే రంజాన్ నెలలో ముగ్గురికి ఆర్థికసాయం అందించామని, నిరుపేదలకు సేవచేయడమే లక్ష్యంగా మేవా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేవా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ముస్తఫా, జహీర్ పాషా, దావత్ మస్జీద్ కమిటీ అధ్యక్షులు మహబూబ్ఖాన్, మేవా కమిటీ సభ్యులు సోహెల్ పాషా, అక్బర్ అఫీజ్, సైదుద్దీన్, గ్రామపెద్దలు గుల్మహ్మద్, మజీద్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ మహిళా విభాగం సిద్ధం

- మార్చి 8న సేవాభావం కలిగిన మహిళల సన్మానానికి నిర్ణయం



**భద్రాచలం, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి :** భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్ల సమావేశం జరిగింది. మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న సంఘ సేవకురాళ్లను గుర్తించి, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. మహిళల సాధికారత, సమాజ నిర్మాణంలో వారి పాత్రను గుర్తించి ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నాయకులు తెలిపారు.మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు రావాలని, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ కట్టుబడి ఉంటుందని సమావేశంలో పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడటంలో బీఆర్ఎస్ మహిళా విభాగం ముందుంటుందని స్పష్టం చేశారు.మార్చి 8న నిర్వహించే సన్మాన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మహిళా నాయకురాళ్లు కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, కనితి రాధ, తెల్లం కామేశ్వరి, సలోని హేమ, సోము సుశీల, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## చలి వేంద్రం ప్రారంభించిన తాసీల్దార్






**చర్ల, ఫిబ్రవరి 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం బిఆర్ యస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చర్ల తాసిల్దార్ శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎండలు తీవ్రంగా ఉన్నాయి అని ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చలి వేంద్రం ఏర్పాటు చేసినందుకు అభినందనలు అని స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయుటకు ముందుకు రావాలని అన్నారు .బి ఆర్ ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతు గత సంవత్సరం కూడ మా పార్టీ తరుపున 22 వేల రూపాయలతో ఫ్రిజ్ కొని మార్చి నుండి జూన్ వరకు 4 నెలలు నిరంతరం అనేక గ్రామాల నుండి వచ్చె గిరిజనులకు ప్రతీ ఆదివారం సంత వ్యాపారస్తుల సంతకు వచ్చే వారికి దాహం తీర్చేందుకు 8 వేలు నీళ్లుకు ఖర్చు పెట్టి బీద ప్రజల దాహం తీర్చేందుకు కృషి చేసాము అని ఈ సంవత్సరం కూడా ప్రజల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది అని ఈ కార్యక్రమం నిర్వహించడంలో నాకు చాలా తృప్తిగా ఉంది అని ఈ సందర్భంగా తాసిల్దార్ కి ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను అని అన్నారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకి అనిల్ తోటపల్లి మాధవరావు బిసి సెల్ అధ్యక్షుడు గోరంట్ల వెంకటేశ్వరావు కునుకు భద్రం అలవాల కృష్ణ'ప్రేమ్ యూత్ నాయకులు బొజ్జ సాయిప్రణీత్ ఎనమూరి సృజన్ తోటపల్లి సాయి అంకాల శ్రీనివాసరావు మహిళ నాయకురాలు బేతం చర్ల నర్సవేణి చెనుమళ్ల వంశీ అనేకమంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నవ సమాజానికి స్ఫూర్తి ప్రదాత సంత్ సేవాలాల్

- బంజారా సంస్కృతిని కాపాడుతూ సేవా మార్గంలో నడవాలి
- సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ముగింపు వేడుకలు
- ఇల్లందులో భారీ సద్భావన యాత్ర





**ఇల్లందు, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి:** బంజారాల ఆత్మగౌరవ ప్రతీక, అహింసా మూర్తి, సమాజ సంస్కర్త శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని, నవ సమాజానికి స్ఫూర్తి ప్రదాత సంత్ సేవాలాల్ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐటిడిఎ పిఓ రాహుల్, జిల్లా ఎస్పి రోహిత్ రాజు, అడిషనల్ కలెక్టర్ వేణు గోపాల్ లు కొనియాడారు. శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెండాల వాగు సమీపంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం నుండి ఇల్లందు ప్రధాన వీధుల మీదుగా బంజారా సంప్రదాయాలతో సద్భావన యాత్ర జెకె కాలనీలోని సింగరేణి క్రీడా ప్రాంగణం (బ్లాక్ డైమండ్ స్టేడియం) వద్దకు చేరుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా సంస్కృతిని కాపాడుతూ సేవా మార్గంలో నడవాలని సూచించారు. అడవి బిడ్డల అభ్యున్నతి కోసం, సమాజ ధర్మ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సేవాలాల్ మహరాజ్ చూపిన బాట నేటి ఆధునిక సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో బంజారా జాతి వెనుకబడిపోకుండా సేవాలాల్ మహరాజ్ ఆలోచనా విధానాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సేవా మార్గమే క్షేమ మార్గం అని చాటిన ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోని, కులమతాలకు అతీతంగా సమ సమాజ స్థాపనకై ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. తండాల అభివృద్ధి, విద్యావంతులైన యువత భాగస్వామ్యంతోనే జాతి పురోభివృద్ధి సాధ్యమవుందని తెలిపారు. జయంతి వేడుకల సమయంలో మద్యం సేవించడం, మాంసాహారం భుజించడం వంటివి సేవాలాల్ బోధనలకు విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మడుగు సాంబమూర్తి, మండల రాము, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బంజారా కులస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఆంగ్ల పరీక్ష

**పాల్వంచ ,ఫిబ్రవరి 28 ,ప్రజా జ్యోతి:** జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఆంగ్ల పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో సెట్ –సి ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. హాజరు వివరాలను వెల్లడిస్తూ.. జిల్లావ్యాప్తంగా జనరల్, వొకేషనల్ విభాగాల్లో కలిపి మొత్తం 8,546 మంది విద్యార్థులకు గాను 8,362 మంది హాజరయ్యారని, 184 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. జనరల్ విభాగంలో 6,801 మందికి 6,682 మంది (119 మంది గైర్హాజరు), వొకేషనల్ విభాగంలో 1,745 మందికి 1,680 మంది (65 మంది గైర్హాజరు) పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, మాల్ ప్రాక్టీస్ కేసులు ఏవీ నమోదు కాలేదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, తదుపరి పరీక్షలకు కూడా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

## మేర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

- దర్జీ కార్మికుల సంక్షేమం కోసం టైలర్స్ డే వేదికగా వినతి



**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** ఫిబ్రవరి 28న టైలర్స్ డే సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన గట్ల సర్వేశ్వర రావు ఇంటి వద్ద మేర (దర్జీ) సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు మేడిది గవరయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చేతివృత్తిని జీవనాధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న మేర (దర్జీ) కులస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా కుట్టు యంత్రాలు, ఆర్థిక సహాయం అందించి వారి ఆర్థిక స్థితి మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గట్ల సర్వేశ్వరరావు, రావెల్లి అజయ్ కుమార్, వానరాశి కోటేశ్వరరావు, నిమ్మల వెంకటేశ్వరరావు, మేడిది వెంకటరత్నం, రాంబాబు, శ్రీను, గట్ల వెంకన్న, నాగరాజు, వానరాశి రాఘవులు, వెంకన్న, రాజారావు, రెబ్బ సాయి, రాంబాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల పై అవగాహన సదస్సు

- ఎస్సీ,ఎస్టీ ప్రజలు హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలి
- డిప్యూటీ తహసీల్దార్ ముద్ద రాజు



**చర్ల, ఫిబ్రవరి 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ వారిచే ఏర్పాటు నిర్వహించిన పౌరహక్కులపై అవగాహన సదస్సు కార్యక్రమంలో చర్ల డిప్యూటీ తహసీల్దార్ ముద్ద రాజు పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ప్రజల పట్ల ఇతర కులాలకు చెందిన వారు అమర్యాదగా ప్రవర్తిస్తే తీవ్రమైన చట్ట పరమైన చర్యలు ఉంటాయని ఎవరైనా హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఎస్సీ ఎస్టీ ప్రజల శ్రేయస్సు మేరకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి చట్టాలపై అవగాహన పెంచేలా స్థానిక రెవిన్యూ శాఖ పోలీసు శాఖతో కలిసి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరంతరాయంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని సూచించారు.ఇలాంటి అవగాహన సదస్సులను ఎస్సీ ఎస్టీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం జోగ మహాలక్ష్మి ఉప సర్పంచ్ పూనెం సంతోషి,ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి జి.శ్రీనివాసు, పంచాయతీ సెక్రటరీ రవికుమార్,వార్డు మెంబర్లు తడికల శివ కుమార్,బీరబోయిన శేఖర్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పేరుతో...

# ఇటుక మాఫియా దందా!

- పినపాక మండలంలో నాసిరకం ఇటుకలతో ప్రజలపై బహిరంగ దోపిడీ
- ఇటుక ఖరీదు 25 నుండి 26 రూ, నాణ్యత మాత్రం సున్నా!
- అనుమతుల్లేని యార్డులు
- అధికారుల మౌనం ఎందుకు?

**పినపాక, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి):** పేదలకు సొంతిల్లు కల నెరవేర్చేందుకు ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు... ఇప్పుడు కొంతమంది వ్యాపారులకు అక్రమ సంపాదనకు బంగారు బాతుగా మారాయి. పినపాక మండలంలో సిమెంట్ ఇటుకల పేరుతో భారీ స్థాయిలో ధరల దోపిడీ జరుగుతుండగా, నాణ్యత లేకుండా తయారు చేసిన ఇటుకలను అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక తయారీ యార్డులు ఎటువంటి అధికార అనుమతులు లేకుండానే వెలిసి, నిర్మాణ సామగ్రి నియంత్రణ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి విచ్చలవిడిగా వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఇటుకలకు డిమాండ్ పెరగడం సహజమే. అయితే ఈ పరిస్థితిని కొందరు వ్యాపారులు దుర్వినియోగం చేస్తూ

ఒక్కో సిమెంట్ ఇటుక ధరను ₹25 నుంచి ₹26 వరకు వసూలు చేసి డబ్బులు దండుకుంటున్నారు.

ఎలాంటి రేటు నియంత్రణ లేకుండా ఇష్టానుసారంగా అమ్మకాలు జరుపుతున్నారు.

బలహీనమైన, సరిగ్గా గట్టిపడని ఇటుకలను సరఫరా చేయడం

పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరిపి పన్నులు తప్పించుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాణ్యత లేకుండా తయారీ భవిష్యత్‌లో ఇళ్ల భద్రత ప్రమాదంలో నిర్మాణ నిపుణుల ప్రకారం సరైన ప్రమాణాలు పాటించకుండా తయారయ్యే ఇటుకలు భవనాల బలాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. స్థానికంగా తయారవుతున్న ఇటుకల తయారీపై వస్తున్న ఆరోపణలు సరైన సిమెంట్–ఇసుక మిశ్రమ నిష్పత్తి లేకపోవడం కరువింగ్ (నీటిలో నానబెట్టే ప్రక్రియ) పూర్తిగా చేయకపోవడం వలన చేతితో నొక్కితేనే ముక్కలయ్యే స్థాయి నాసిరకం తయారీ ఇటుకలను, పరీక్షలు లేకుండానే నేరుగా వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. "ఇలా నిర్మించిన ఇళ్లు ఎంత కాలం నిలుస్తాయో తెలియని పరిస్థితి" అని మేస్త్రీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేవు... పర్యవేక్షణ లేదు... కానీ వ్యాపారం జోరుగా! కొనసాగుతుంది.

**మండలంలో అనేక ఇటుక యార్డులు:**

పరిశ్రమల శాఖ లేదా స్థానిక సంస్థల అనుమతులు లేకుండా

కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకుండా భద్రతా నిబంధనలు లెక్కచేయకుండా ప్రభుత్వానికి ఎటువంటి అధికారిక రికార్డులు లేకుండానే నడుస్తున్నాయని సమాచారం. ఇది కేవలం అక్రమ వ్యాపారం మాత్రమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యగా కూడా భావిస్తున్నారు.

**పేదల ఇల్లు నిర్మాణం... కానీ ఖర్చులు రెట్టింపు**

ఇందిరమ్మ ఇండ్ల కోసం అప్పులు చేసి, ఆశతో ఇళ్లు కడుతున్న లబ్ధిదారులు ఇప్పుడు ఇటుకల ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటుకల ధరలు పెరగడంతో నిర్మాణ ఖర్చు భారీగా పెరిగి, పథకం ప్రయోజనం తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**అధికారులు చూస్తున్నారా? లేక చూడనట్లే నటిస్తున్నారా?**

ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్న అంశం ఇదే. మండలంలో బహిరంగంగా జరుగుతున్న ఈ దందాపై ఇప్పటివరకు గట్టిచర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**స్థానికులు చెబుతున్నది ఏమిటంటే:**

"పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కొందరు లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు...

కానీ నాణ్యత, నియంత్రణ, తనిఖీలు ఎక్కడా కనిపించడం లేదు."

"ఇందిరమ్మ ఇండ్లు పేదల ఆశ... దాన్ని దోపిడీ వ్యాపారంగా మార్చొద్దు" ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకం అమలులో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకుంటే, అసలు లబ్ధిదారులే నష్టపోతారని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి పుట్టబట్టిలపై చర్యలు తీసుకోకపోతే ఈ సమస్య మరింత విస్తరించే ప్రమాదం ఉందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# పేద–మధ్యతరగతి కుటుంబాల కష్టాలకు చెక్

- పేదల పెళ్లిళ్లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి
- సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ - ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం గండుగలపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ పథకం కింద 88 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.88,10,208 విలువైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేద ,మధ్యతరగతి కుటుంబాలకు నిజమైన అండగా నిలుస్తోందన్నారు. ఆడపిల్లల వివాహ సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా బలపరుస్తోందని తెలిపారు. మహిళలు బలపడితే కుటుంబం, గ్రామం, సమాజం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. బాల్యవివాహాలపై కఠిన హెచ్చరిక జారీ చేస్తూ, చట్టపరంగా నిర్దేశించిన 18 సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు వివాహాలు చేయరాదని సూచించారు. చిన్న వయసులో వివాహాలు ఆరోగ్యానికి, భవిష్యత్తుకు హానికరమని, బాల్యవివాహాలు నిర్వహిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రజలు చట్టాలను గౌరవించి తమ పిల్లల విద్య, భవిష్యత్తుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, రావు గంగాధర్ రావు, ఎర్రా వసంతరావు, పగడాల రాంబాబు, వంకా జానకిరాముడు, కూరం అర్జునరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, దమ్మపేట తహసీల్దార్ రామ్ నరేష్, ఆర్ఐలు బిక్షమయ్య, వీరాస్వామి, జూనియర్ అసిస్టెంట్ అలీ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఫిబ్రవరి 28 నుంచి మార్చి 5 వరకు ఘనంగా ఉత్సవాలు
- మార్చి 2న రాత్రి 10 గంటలకు స్వామివారి కళ్యాణం





**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కార్యక్రమాలను యజ్ఞాచార్యులు ప్రతాపురం గిరిధరాచార్యులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమాల్లో స్వామివారికి విశేష ఆరాధన నిర్వహించి, విష్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, ఋత్విక్ వరణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం వంటి శాస్త్రోక్త కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో పాకాల వెంకటరమణ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, పార్కింగ్, దర్శన సదుపాయాలు, తీర్థప్రసాదాల పంపిణీ వంటి ఏర్పాట్లు సమకూర్చినట్లు వెల్లడించారు. ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ప్రతి రోజు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మార్చి 2వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ అధికారులు కోరారు.

## గీతాంజలి హై స్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** స్థానిక గీతాంజలి హై స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలు తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దమ్మపేట ఎస్సై బాలస్వామి, దారా మల్లికార్జునరావు, గాయత్రి ఆశ్రమం గురూజీ, వార్డు సభ్యుడు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పాఠశాల చైర్మన్ మేడిది గౌరయ్య హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టుల విశేషాలను ఆంగ్లంలో సమర్థంగా వివరించారు.ఈ సందర్భముగా వక్తలు మాట్లాడుతూ సైన్స్ మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ బాలలే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగి గొప్ప ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు.పాఠశాల ప్రిన్సిపాల్ మేడిది వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సైన్స్, సాంస్కృతిక, క్రీడా రంగాలలోనూ ప్రతిభ కనబరిచేలా పాఠశాల కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం గీతాంజలి పాఠశాల లక్ష్యమని పేర్కొన్నారు.కాంతి విక్షేపణంపై పరిశోధనలు చేసి రామన్ ప్రభావాన్ని కనుగొన్న శాస్త్రవేత్త సి.వి. రామన్ జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టిని సారించాలి



**టేకులపల్లి,ఫిబ్రవరి28, ప్రజాజ్యోతి:**టేకులపల్లి మండల కేంద్రంలోనీ వాగొడ్డు తండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణోత్ లక్ష్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రముఖ శాస్త్రవేత్త సివి రామన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళలర్పించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు, డ్రాయింగ్స్, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బానోత్ లక్ష్మా మాట్లాడుతు చంద్రశేఖర్ వెంకట రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్సడే నిర్వహిస్తారని, విద్యార్థుల్లోనీ సృజనాత్మకతను వెలికి తీయడానికి ప్రస్తుతం బాలమెల నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచకోవాలని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టిని సారించాలని ఆయన సూచించారు.ఉన్నంత విద్య అభ్యసించి మంచి లక్షణాలతో,ఎదగాలని, సాంకేతికతను అందుపుచ్చుకునేల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల కృషి నిరంతరం ఉంటుందని ఆయన తెలిపారు.ఇలాంటి పోటిలల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి జీవితంలో ఉన్నత శిఖరాలు ఎదగాలని అన్నారు.ప్రతిభ కనబరిచి విద్యార్థులకూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విధ్యార్థులు,రవి,రమేష్, గోళ్య, ధ్వాలి పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సాగిన 'ఎఫ్.ఎల్.ఎన్ బాలమేళా 2.0

- ప్రతిభ చాటిన ఆళ్ళపల్లి మండల విద్యార్థులు





**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి28. ప్రజాజ్యోతి** :మండల విద్యా వనరుల కేంద్రంలో 'ఎఫ్. ఎల్.ఎన్ (ఎఫ్ఎల్ఎన్) బాలమేళా 2.0' వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి (ఎం ఇ ఒ) కే. శాంతారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీయడానికి చక్కని వేదికలని కొనియాడారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతల వివరాలను ప్రకటించారు.మండల స్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఇ. నిత్విక్ 1వ తరగతి, ఎం.పి.పి.ఎస్ వలసల్ల ఎ. వినయ్ తేజ 2వ తరగతి, ఎం.పి.పి.ఎస్ వలసల్ల కె. ఐశ్వర్య 3వ తరగతి, ఎం.పి.పి.ఎస్ రాఘవాపురం. జి. యశ్వంత్ 4వ తరగతి, ఎం.పి.పి.ఎస్ వలసల ఇ.వర్షిణి 5వ తరగతి, ఎం. పి.పి.ఎస్ వలసల్ల(లైబ్రరీ)విభాగం విజేతలుజి. చంద్రధరన్ 1వ తరగతి, .పి. పి.ఎస్ ఆళ్ళపల్లి జి. తనుశ్రీ 2వ తరగతి. ఎం.పి.పి.ఎస్ వలసల్ల.కె. సంజయ్ వర్ధన్ 3వ తరగతి, ఎం.పి.పి.ఎస్ పాతూరు. ఎ. తనుజ 4వ తరగతి, ఎం.పి. పి. ఎస్ వలసల్ల.జి. చరణ్ తేజ్ 5వ తరగతి, ఎం.పి.పి.ఎస్ ఆళ్ళపల్లిఈ కార్యక్రమం లో జడ్పీహెచ్ఎస్ మర్కోడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి. బాబులాల్, డి ఆర్పి ఎల్. రాందాస్, ఎమ్మార్పీలు హాతిరాం, ఏ. రామకృష్ణ, ఎం. శ్రీనివాసరా వు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి ఉపాధ్యాయులు కవిత, పార్వతి, సువర్ణ, బొజ్జ రాజా, విజయ తదితరులు తమ వంతు సహకారాన్ని అందించారు. విజేతలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

# కేఓసిలో దుమ్ము నివారణ చర్యలు శూన్యం

- ఓబీలో కనిపించని నీటి ట్యాంకర్లు
- నెలవారీగా బిల్లులు చేసుకుంటున్న వైనం
- బిల్లులు కావడంలో కేఓసీ పీఓ హస్తం..?





**టేకులపల్లి,ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి:** కోయగూడెం ఓసిలో దుమ్ము నివారణ చర్యలు చేపట్టడంలో కెఓసి ప్రాజెక్ట్ అధికారి విఫలమయ్యారు. కోయగూడెం ఓసి లోనీ అంతర్గత వీధుల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లించకపోవడంతో కెఓసి మొత్తం దుమ్ముమయంగా మారింది.కేవలం సింగరేణి ట్యాంకర్ ద్వారా మాత్రమే నీళ్లు చలిస్తున్నారు. టెండర్ నిబంధనల మేరకు ఓబీ యాజమాన్యం ఆధ్వర్యంలో మూడు నీటి ట్యాంకర్ల ద్వారా కూడా నీళ్లు చల్లించాల్సి ఉంటుంది. కానీ మూడు ట్యాంకర్లను నిర్వహించకపోవడం గమనార్హం.కేఓసి అంతా దుమ్ముమయం నిత్యం ఓబి యాజమాన్యం ఆధ్వర్యం లో 3 ట్యాంకర్లు,ఒక సింగరేణి ట్యాంకర్ ద్వారా నిత్యం నీళ్లు చల్లించాల్సి ఉంటుంది. కానీ కేవలం సింగరేణి ట్యాంకర్ ద్వారా తు తూ మంత్రంగా మాత్రమే నీళ్లు చల్లిస్తున్నారు. ఓబి యాజమాన్యం ఏర్పాటు చేయాల్సిన మూడు ట్యాంకర్లను ఇక్కడ ఏర్పాటు చేయలేదు. దీంతో ఓసి లోని అంతర్గత వీధులు,చెక్ పోస్ట్,కోల్ యార్డ్ ప్రాంతాలలో విపరీతమైన దుమ్ము ఎగిసిపడుతూ ఉంది. సింగరేణి, ఆఫ్ లోడింగ్ కార్మికులు విధులు నిర్వహించలేకపోతున్నారు.

**బిల్లులు చేయడంలో కే ఓ సి పి ఓ హస్తం..?**

నిబంధనల మేరకు మూడు ట్యాంకర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ ఒక్క ట్యాంకర్ కూడా ఓబి యాజమాన్యం ఏర్పాటు చేయలేదు. కానీ ప్రతి నెల మూడు ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లుతున్నట్లుగా బిల్లులు మాత్రం చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కోయగూడెం ప్రాజెక్టు అధికారి కనుసనల్లోనే నీటి ట్యాంకులకు సంబంధించిన బిల్స్ అవుతున్నాయని తెలిసింది.ఇలా లక్షలాది రూపాయల సింగరేణి సొమ్మును గంపగుత్తాగా కోయగూడెం ప్రాజెక్టు అధికారి ధారాధత్తం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అనారోగ్యం బారిన పడిన కార్మికులు కేఓసి లో దుమ్ము నివారణ చర్యలు చేపట్టకపోవడంతో పలువురు కార్మికులు అనారోగ్యం బారిన పడ్డారు.ఓ మెకానికల్ ఫోర్ మెన్,క్వాలిటీ విభాగంలోని ఓకార్మికుడు అనారోగ్యం బారిన పడ్డారు.ఇదే విషయాన్ని పలుమార్లు కోయగూడెం ఓసి పీవో దృష్టికి సేఫ్టీ,మైనింగ్ కమిటీ సభ్యులు తీసుకువెళ్లినప్పటికీ కె ఓ సి పి ఓ పెడచెవిన పెట్టడం శోచనీయం అని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కెఓసి పిఓ ను వివరణ కోరడానికి ఫోన్ ద్వారా పలు మార్లు సంప్రదించగా ఎటువంటి స్పందన లేదు.

## పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి






**పాల్వంచ ,ఫిబ్రవరి 28 ,ప్రజా జ్యోతి:** పీఎం విశ్వకర్మ పథకాన్నివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి సూచించారు. శనివారం రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపీ పథకాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, నిరుద్యోగులకు, చేతివృత్తులు చేసుకునే వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసే విధానం, అందించే సబ్సిడీ శాతం, అర్హత ప్రమాణాలు, అలాగే ఏ ఏ రంగాలకు చెందిన వారు అర్హులనే అంశాలపై సమగ్రంగా వివరించారు.అనంతరం ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. రుణం పొందేందుకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు విధానం, లబ్ధిదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పీఎం విశ్వకర్మ లబ్దిదారులకు ఐపీపీబీ ఖాతాలను ప్రారంభించి, ఆన్‌లైన్ మర్చంట్ స్టికర్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫెసిలిటేషన్ ఆఫీసర్ (ఎంఎస్ఎంఈ) దినేష్ కుమార్, ర్యాంప్ ఈడీసీ మేనేజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహణ






**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దమ్మపేట మండల పరిధిలోని ఏజిహెచ్‌ఎస్–డి గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి చింత చంద్రకళ అధ్యక్షత వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీ బొర్రా పాపయ్య, శ్రీ బానోత్ సీతారాం, శ్రీమతి పానుగంటి శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప లు శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు డ్రాయింగ్ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, శాస్త్ర విజ్ఞానం మన దైనందిన జీవితంలో ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దమ్మపేట నూతన పంచాయత్ కార్యదర్శిగా బండి అనంత కుమార్



**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామానికి నూతన పంచాయత్ కార్యదర్శిగా బండి అనంత కుమార్ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామ పరిశుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదల, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ, నూతన పంచాయత్ కార్యదర్శికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడంలో కలిసి పనిచేస్తామని, ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామని ఆమె అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దర్జీలు దర్జాగా జీవించాలి

- ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలను అందిస్తాం... ఎమ్మెల్యే జారే

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి :** దర్జీలు దర్జాగా జీవించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తామని స్థానిక సంస్థల సభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హౌనే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తమ సొంత ఖర్చులతో నల్లబోతుల వరలక్ష్మి, పూడ రమాదేవి ఇరువురికి రెండు కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్త్రాన్ని కత్తిరించి, కలిపి కుట్టి ఓ రూపు తెచ్చేది దర్జీలు అని ఆ దుస్తులు మనిషికి దర్జాను తీసుకువస్తాయన్నారు.ఇలా ఓ మనిషికి డ్రెస్సులతో హుందాతనాన్ని తీసుకువస్తున్న దర్జీల బతుకుల్లో మాత్రం దర్జా మాయమవుతోంది. రెడీమేడ్ దుస్తుల రాకతో ఉపాధి కరువైందని, వారిని అవకాశం ఉన్నంతలో ప్రభుత్వపరంగా ఆదుకుంటూ అండగా ఉంటామన్నారు ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, పలువురు వార్డు కౌన్సిలర్లు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు



ఈదర సర్వేశారరావు, ఉపాధ్యక్షులు కొనాకళ్ల శ్రీనివాస్, సెక్రటరీ పాత్రుని అప్పారావు , జాయింట్ సెక్రెటరీ నోముల సత్యప్రసాద్ , కోశాధికారి అధికార్ల నాగరాజు , ప్రచారా కార్యదర్శి నోముల రామకృష్ణ సహాయ కార్యదర్శి దార రవి, మహిళా కార్యవర్గ సభ్యులు, మైబూబీ, గుర్రాల, స్వప్న, వలిమ,శ్రీలత, కమిటీ నెంబర్స్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ పి ఎస్ టి జిల్లా కమిటీ ఎన్నిక





**టేకులపల్లి,ఫిబ్రవరి28, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్ పి ఎస్ టి) నూతన కమిటీని శనివారం కొత్తగూడెంలోని ఆనందఖని జడ్పీహెచ్ఎస్లో నిర్వహించిన జిల్లా సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా టేకులపల్లి జిహెచ్ఎస్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎం మోహన్ రావు వివరాలు వెల్లడించారు.ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్ జిల్లా అధ్యక్షుడిగా ఎం మోహన్ రావు ( టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ),ప్రధాన కార్యదర్శిగా ఏ. శంకర్రావు ( జడ్పీహెచ్ఎస్ నెల్లిపాక బంజర ), గౌరవ అధ్యక్షులుగా ఎన్. రాజశేఖర్ ( ఏఎంఓ ),గౌరవ కార్యదర్శిగా ఎస్ కే.సైదులు( సీఎంఓ ),కోశాధికారిగా ఎస్. యశోద ( పాల్వంచ),మహిళా ప్రతినిధిగా జీ. అనురాధ ( కొత్తగూడెం), ఉపాధ్యక్షులుగా ప్రభు సింగ్ ( ఇల్లందు ),జె. లక్ష్మి( రుద్రంపూర్ ), బి. బాసు(భద్రాచలం), సహాయ కార్యదర్శులుగా బి.బిచ్చ ( ములకలపల్లి ), ఉమాదేవి ( బూర్గంపాడు),డి.రామిరెడ్డి ( పినపాక ),టెక్నికల్ కార్యదర్శులుగా టీ.పాపారావు ( పాల్వంచ),సిహెచ్ శ్రీనివాస్ ( భద్రాచలం ),డివిజనల్ ఇన్చార్జులుగా కే.నాగేశ్వరరావు ( మణుగూరు ),డి ఏ.రామకృష్ణ ( భద్రాచలం ),పి. దుర్గా శైలజ ( పాల్వంచ), ఎం ఎం. భాస్కరాచారి ( దమ్మపేట ), బి.దేవిలాల్ ( కొత్తగూడెం), ఎస్.శాంతకుమారి ( జూలూరుపాడు ),ఎం.రఘు ( ఇల్లందు ) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎఫ్ పిఎస్టి కమిటీని రాష్ట్ర ఎఫ్ పి ఎస్ టి కమిటీ ఆమోదించినట్లు జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఓ సంపత్ కుమార్ వివిధ మండలాలకు చెందిన ఫిజికల్ సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

## న్యూ ఆక్స్ఫర్డ్ పాఠశాలలో విజ్ఞానోత్సవం – చిన్నారుల సృజనాత్మకతకు వేదిక

- సౌర కుటుంబం నుంచి నీటి శుద్ధి నమూనాల వరకూ వినూత్న ప్రదర్శనలు
- విద్యార్థుల ప్రతిభను అభినందించిన పాఠశాల యాజమాన్యం

**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 28, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి న్యూ ఆక్స్ఫర్డ్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ అంశాలపై వినూత్న నమూనాలు రూపొందించి ఆకట్టుకున్నారు. జంతుప్రదర్శనశాల నమూనా, సౌర కుటుంబ నిర్మాణం, నీటి శుద్ధి పరికరాలు తదితర విజ్ఞాన నమూనాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. ఆకులు, పునర్వినియోగ వస్తువులు మరియు ఇతర సాధనాలతో రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి తరగతి విద్యార్థులు తమకు తోచిన ఆలోచనలను ఆవిష్కరించి విజ్ఞాన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. చిన్నారుల ఊహాశక్తి, పరిశోధనా



తపన, వివరణ నైపుణ్యం ఉపాధ్యాయులను మెప్పించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. విజయ భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్వహణ ప్రతినిధి కళావతి విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు వారి ప్రతిభను వెలికితీయడంలో కీలకమని పేర్కొన్నారు. తరగతి ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి విభాగంలో పాల్గొనేలా మార్గనిర్దేశం చేశారు. విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## ఘనంగా టైలర్స్ డే వేడుకలు



**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 28, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో టైలర్స్ అందరూ ఒకచోట చేరి ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా వస్త్రాలు కుట్టి జీవనం గడుపుతున్న టైలర్స్ పరిస్థితి ప్రస్తుతం కష్టతరంగా మారిందన్నారు. రెడీమేడ్ వస్త్రాల విస్తరణతో ప్రజలు వాటిపట్ల ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని, దీంతో టైలర్స్ ఆదరణ తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టైలర్స్‌కు పింఛన్, ఇన్సూరెన్స్, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సీతారామయ్య, నగేష్, రేగులగడ్డ పోలయ్య, యాకూబ్, పాషా, గాజుల రాంబాబు, హుస్సేన్ తదితరులు పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. టైలర్స్ ఐక్యతతో తమ వృత్తి పరిరక్షణ కోసం కృషి చేయాలని నిర్ణయించారు.

## మొద్దులగూడెంలో అమరజీవి మట్టా సత్యనారాయణ 26వ వర్ధంతి



**దమ్మపేట, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ మట్టా సత్యనారాయణ 26వ వర్ధంతిని నిర్వహించారు. మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.మొదట స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను గ్రామ శాఖ కార్యదర్శి చెన్నుబోయిన బ్రహ్మయ్య ఎగురవేశారు. అనంతరం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో నాయకులు మాట్లాడుతూ మట్టా సత్యనారాయణ పేదలు, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాటం చేశారని, మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పార్టీ సభ్యులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి, ఫిబ్రవరి28, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కోయగూడెం గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు చీమల రాజు, మహేశ్వరి దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడంతో శనివారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి నూతన ఇంటిని ప్రారంభించారు. ఇంటి యజమాని దంపతులను ఎమ్మెల్యే కనకయ్య శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తమ సొంత ఇంటి కల నెరవేర్చినందుకు ఎమ్మెల్యే కనకయ్యకు,ఇందిరమ్మ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.